సాక్షి
వికారాబాద్
శుక్రవారం। 22। నవంబర్। 2024



దిగుబడి.. దిగులు

ప్రస్తుత ఖరీఫ్ పంటలపై రైతుల ఆశలు ఆవిరయ్యాయి. అధిక వర్షాలతో పంటలు ఎదగలేదు.

8లో▸



మెనూ పాటించకపోతే..

మెనూ ప్రకారం భోజనం పెట్టకపోతే చర్యలు తప్పవని తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ హెచ్చరించారు.

8లో▸



ఐదేళ్లుగా పెండింగ్‌లోనే..!

కొడంగల్ నియోజకవర్గంలో ఐదేళ్లక్రితం మంజూరైన కమ్యూనిటీ భవనాలు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి.

9లో▸

న్యూస్‌రీల్

1 నుంచి టాక్సీ, క్యాబ్ సబ్సిడీల నిలిపివేత

అనంతగిరి: టాక్సీ, మోటారు క్యాబ్ సబ్సిడీలను నిలిపేస్తున్నట్లు పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ మహేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిశ్రమల శాఖ కింద రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న టీ- ప్రైడ్ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ లబ్ధిదారులకు టాక్సీ, మోటార్ క్యాబ్ కింద అందిస్తున్న రాయితీని, ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు డిసెంబర్ 1వ తేదీ నుంచి నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కొనుగోలు చేసే వాహనాలకు సబ్సిడీ వర్తించదని తెలిపారు.

ఎన్నికల నిర్వహణపై సమీక్ష



సమీక్షలో అధికారులకు సూచనలు చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ చెన్నయ్య

ఇబ్రహీంపట్నం: ఎన్నికల నిర్వహణపై గురువారం డిప్యూటీ కలెక్టర్ (ఎన్నికల సంఘం) చెన్నయ్య ఇబ్రహీంపట్నం ఆర్డీఓ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిబంధనలను వివరించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో ఆర్డీఓ అనంతరెడ్డి, ఆయా మండలాల తహసీల్దార్లు, ఎన్నికల నిర్వహణ సిబ్బంది పాల్గొన్నారు.

కరాటే మాస్టర్ చెన్నయ్యను అభినందించిన డీజీపీ

షాద్‌నగర్: షాద్‌నగర్‌కు చెందిన కరాటే మాస్టర్ ఎత్తిన చెన్నయ్యను డీజీపీ జితేందర్ అభినందించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ పోలీస్ అకాడమీలో గురువారం మహిళా పోలీస్ పరేడ్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీజీపీ పోలీసులకు శిక్షణ ఇస్తున్న మాస్టర్ చెన్నయ్యను ప్రత్యేకంగా అభినందించారు.

శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

మొయినాబాద్: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, చేవెళ్ల నియోజకవర్గ కన్వీనర్ రామస్వామి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని పెద్దమంగళారంలో పార్టీ మండల కార్యదర్శి కె.శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం గ్రామ శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ.. రాష్ట్రంలో, దేశంలో ప్రభుత్వాలు మారినా ప్రజల బతుకులు మాత్రం మారడం లేదని అన్నారు. వందేళ్ల చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ అనేక పోరాటాలు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేసిందన్నారు. సమావేశంలో జిల్లా మహిళా సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల, మోహన్‌రెడ్డి, ప్రభాకర్, దర్శన్, హనుమంతు, ఎండీ జహంగీర్, రత్నం, జలీల్ పాల్గొన్నారు.

రబీ.. రెడీ

యాసంగి సాగుకు సిద్ధమవుతున్న కర్షకులు

- సాధారణ సాగు విస్తీర్ణం 1,22,593 ఎకరాలు
- ఈసారి సాగు అంచనా 1,44,480 ఎకరాలు
- అందుబాటులో ఎరువులు, విత్తనాలు
- రాయితీకి ఈసారి మంగళమే



వికారాబాద్: రబీ సాగులో రైతన్న రెడీ అయ్యాడు. వేరుశనగ లాంటి విత్తనాలు ఇప్పటికే ప్రారంభించగా శనగ, వరి పంటల సాగుకు సమాయత్తమవుతున్నాడు. ఇదే సమయంలో యాసంగి సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు వ్యవసాయ శాఖ కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉండేలా చూస్తోంది. అయితే రాయితీ విత్తనాలకు ప్రభుత్వం ఈసారి కూడా మంగళం పలికింది. గతంలో వేరుశనగ (పల్లి), శనగ విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై అందజేసింది. మూడేళ్లుగా వీటికి గుడ్‌బై చెప్పింది. ఈసారి ప్రభుత్వం మారడంతో తమకు సబ్సిడీ విత్తనాలు అందుతాయని ఆశపడ్డ రైతులకు భంగపాటే ఎదురైంది. సర్కారు చేతులెత్తేయడంతో ప్రైవేటు దుకాణాల్లో కొనుగోలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా వరి విత్తనాల కోసం అవసరమైన ఇండెంట్‌ను వ్యవసాయ శాఖ సిద్ధం చేస్తోంది.

వర్షాలు సమృద్ధిగా కురవడంతో వరికే మొగ్గు..

జిల్లాలో మొత్తం 2.55 లక్షల మంది రైతులు ఉన్నారు. 5.9 లక్షల ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా.. 1,22,593 ఎకరాల్లో రబీ పంటలు వేస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో ఈసారి సాగు పెరగనుందని వ్యవసాయ శాఖ భావిస్తోంది. సుమారు 1,44,480 ఎకరాల్లో ఆయా పంటలు సాగయ్యే అవకాశం ఉందని అంచావేసింది. ఇందులో ఇప్పటి వరకు 16,815 ఎకరాల్లో వివిధ పంటలు వేశారు. ఇందులో జొన్న 906 ఎకరాలు, మొక్కజొన్న 444 ఎకరాలు, శనగ 1,646 ఎకరాలు, వేరుశనగ 12,372 ఎకరాల్లో సాగు చేశారు. రబీ సాగులో వరి పంటదే సింహ భాగం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

అందుబాటులో ఉన్న ఎరువులు

ఎరువు	మెట్రిక్ టన్నుల్లో
యూరియా	6,214
డీఏపీ	1,132
కాంప్లెక్స్	2,759
అమోనియం పాస్ఫేట్	243
సింగిల్ సూపర్ పాస్ఫేట్	150

అమ్మకాలపై పర్యవేక్షణ

ఈసీజన్‌కు అవసరమైన యూరియా, డీఏపీ, కాంప్లెక్స్, ఎంవోపీ (మ్యూరేట్ ఆఫ్ పొటాష్) అందుబాటులో ఉంచారు. మొత్తం 40 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని అధికారులు నివేదించగా, మొదటి విడతలో యాభైశాతం సరఫరా అయ్యింది. ఎరువుల కొరత లేకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎక్కడైనా స్టాక్ అయిపోతే వెంటనే తెప్పించే ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిని విక్రయించేందుకు లైసెన్సు ఉన్న సీడ్స్ అండ్ ఫర్టిలైజర్ దుకాణాలకు 130 ఈ- పాస్ యంత్రాలను అందజేయగా, అమ్మకాలను పర్యవేక్షిస్తున్నారు.

డిసెంబర్ వరకు వేసుకోవచ్చు



రబీ సీజన్‌కు గాను డిసెంబర్ నెలాఖరు వరకు పలు పంటలు వేసుకోవచ్చు. వర్షాలు సమృద్ధిగా కురిసిన నేపథ్యంలో సీజన్ బాగుంటుందని ఆశిస్తున్నాం. సాధారణం కన్నా అధిక విస్తీర్ణంలో పంటలు సాగయ్యే అవకాశం ఉంది. రాయితీ విత్తనాల పంపిణీ విషయంలో ఎలాంటి సమాచారం లేదు. ఎరువులు అవసరమైన మేరకు అందుబాటులో ఉన్నాయి.

– మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి, వికారాబాద్

రైతుల పక్షాన పోరాడుతాం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

పరిగి: లగచర్లలో అధికారులపై దాడికి పాల్పడ్డ వ్యవహారంలో జైలు పాలైన రైతులను పరామర్శించడానికి గురువారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విచ్చేశారు. ఈ క్రమంలో లగచర్ల, రోటిబండతండా, పులిచర్లగుంటతండాలకు వెళ్తుండగా సీపీఎం నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. పట్టణ కేంద్రంలోని కోర్టు పక్కన పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య ఎర్ర టవాల కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వీరభద్రం మాట్లాడుతూ.. ప్రభుత్వం 46 మందిపై హత్యాయత్నం కేసులు పెట్టి గ్రామాల్లోని ప్రజలను భయభ్రాంతుకు గురిచేయడం సరికాదన్నారు. సీపీఎం పార్టీ రైతుల పక్షాన నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రయ్య, హబీబ్, సత్తయ్య, మహిపాల్‌రెడ్డి, రఘురాం, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు

లగచర్లకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం రైతుల పరామర్శకు రానుండటంతో ఉదయం నుంచి వామపక్ష నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. సీపీఎం, సీపీఐ, ఇతర కమ్యూనిస్టు పార్టీల నాయకులను అదుపులోకి తీసుకొని విడుదల చేశారు. అనంతరం వామపక్ష నాయకులు మాట్లాడుతూ.. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు. రైతులను అన్యాయం జరుగుతుంటే ఊరుకోమంటూ హెచ్చరించారు. సీఎం సొంత నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించుకోని ప్రభుత్వం.. రాష్ట్రంలో ఎలా పరిష్కరిస్తుందని ప్రశ్నించారు. వెంటనే ప్రభుత్వం అరెస్టులను ఆపి రైతులను విడుదల చేసి, న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



వామపక్ష నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు



పరిగిలో తమ్మినేని వీరభద్రంకు స్వాగతం పలుకుతున్న సీపీఎం నాయకులు

నమ్మకమైన సిమెంట్‌కు కేరాఫ్ సీసీఐ

- ఢిల్లీ మార్కెటింగ్ జనరల్ మేనేజర్ అలోక్ శుక్లా
- సంస్థ డీలర్లు, సబ్ డీలర్లతో సమావేశం



మాట్లాడుతున్న అలోక్ శుక్లా

అనంతగిరి: ప్రభుత్వ రంగ సంస్థ అయిన సీసీఐ సిమెంట్ నమ్మకమైనదని ఢిల్లీ మార్కెటింగ్ జనరల్ మేనేజర్ అలోక్ శుక్లా అన్నారు. గురువారం వికారాబాద్‌లోని హరిత రిసార్ట్‌లో సీసీఐ సిమెంట్ డీలర్లు, సబ్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐకి జిల్లాలోని తాండూరులో మూడు ఆపరేటింగ్ ప్లాంట్లు ఉన్నాయన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాలకు, హిమాచల్‌ప్రదేశ్, అస్సాం రాష్ట్రాల్లోనూ సీసీఐ సేవలందిస్తోందని తెలిపారు. 1987లో తాండూరు సమీపంలోని కరన్‌కోట్‌లో కంపెనీలు ఏర్పాటు చేసిందన్నారు. ఇందులో ఆర్డినరీ పోర్ట్ ల్యాండ్ సిమెంట్ (ఓపీసీ), పోట్జోలోనా పోర్ట్ ల్యాండ్ సిమెంట్ (పీపీసీ) తో సహాఅన్ని రకాల అధిక నాణ్యత కలిగిన సిమెంట్‌ను తయారు చేస్తోందని వివరించారు. భారతీయ రైల్వేల కోసం కాంక్రీట్ స్లీపర్ల ఉత్పత్తిలో ఉపయోగించే ప్రత్యేక గ్రేడ్ సిమెంట్ అయిన ఓపీసీ 535ను కూడా ఉత్పత్తి చేస్తోందన్నారు. మన మార్కెట్లలో సీసీఐని ప్రోత్సహించిన రిటైలర్లు, డీలర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీఐ జనరల్ మేనేజర్ శరత్ కుమార్, రీజినల్ మేనేజర్ ఉమేష్ కుమార్ సింగ్, సీనియర్ మేనేజర్ దివాకర్ శ్రీవాస్తవ, సీనియర్ మేనేజర్ పాండే, మేనేజర్ ఆఫీసర్లు పి.వెంకట్రాములు, రోహిత్ మిశ్రా, అసిస్టెంట్ ఆఫీసర్లు దేవరాజ్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మేమూ బీసీలమే

రాజకీయ రిజర్వేషన్లు కల్పించండి

- చిన్న పదవులు కూడా దక్కడం లేదు
- అంతరించి పోతున్న వృత్తులకు జీవం పోయండి
- వెనుకబడిన తరగతుల కమిషన్‌కు వృత్తిదారులు, సంచార జాతుల విజ్ఞప్తి



సమావేశానికి హాజరైన తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్, సభ్యులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'పేరుకు తాము బీసీలమే అయినా.. రాజకీయ రిజర్వేషన్లు దక్కడం లేదు.. ప్రభుత్వం కల్పించిన రిజర్వేషన్ల ఫలాలను పెద్దకులాలే అనుభవిస్తున్నాయి.. గ్రామాల్లో కనీసం తమను మనుషులుగా చూడడం లేదు' అని వృత్తిదారులు, సంచార జాతుల వారు తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల్లో అట్టడుగున ఉన్న వర్గాలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశాయి. ఈ మేరకు తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ గురువారం కలెక్టరేట్‌లో బహిరంగ విచారణ చేపట్టింది. కార్యక్రమానికి కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, బాలలక్ష్మి, తిరుమలగిరి సురేందర్, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ హాజరయ్యారు. రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాలకు చెందిన కుల సంఘాలు, వృత్తిదారులు, రాజకీయ పార్టీల నేతల నుంచి అభిప్రాయాలు సేకరించారు. స్థానిక సంస్థల్లో రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని వృత్తిదారులు, సంచార జాతుల సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, కంసాలి, శిల్పి, పూసలి, వాల్మీకిబోయ, ఆరెకటిక, సగర, ఉప్పర, వడ్డెరి, క్షౌ ర వృత్తిదారులకు రాజకీయంగా కనీస ప్రాధాన్యత దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేస్తుండటంతో చాలా తక్కువ జనాభా ఉన్న ఈ సంచార జాతులు ఆర్థికంగానే కాకుండా రాజకీయంగా కూడా నష్ట పోవాల్సి వస్తోందని, కార్పొరేటర్, కౌన్సిలర్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, ఉప సర్పంచ్ పదవులే కాదు కనీసం వార్డు మెంబర్ వంటి చిన్న పదవులు కూడా తమకు దక్కడం లేదని కమిషన్ ముందు వాపోయారు.

ఎవరేమన్నారంటే..

సంచార జాతుల సంఘం అధ్యక్షుడు నరేందర్ మాట్లాడుతూ.. బీసీల్లో ఇప్పటి వరకు ఏ కులం ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడిందో గుర్తించి, వారికి రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. వాల్మీకి బోయ సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ.. మొదట్లో తాము ఎస్టీ జాబితాలో ఉన్నామని, ఆ తర్వాత ప్రభుత్వం తమను బీసీ-ఏలో చేర్చి అన్యాయం చేసిందన్నారు. బీసీ కార్పొరేషన్ ఇచ్చే రుణాల కోసం 3,500 మంది దరఖాస్తు చేసుకుంటే లబ్ధి పొందిన వారిలో వాల్మీకి బోయ కులస్తులు ఒక్కరూ లేరన్నారు. కుమ్మర సంఘం అధ్యక్షుడు దయానంద్ మాట్లాడుతూ.. అంతరించి పోతున్న తమ వృత్తికి జీవం పోయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వంద ఎకరాలు కేటాయించి వృత్తిదారులకు శిక్షణ ఇవ్వాలని కోరారు. వడ్డెర సంఘం అధ్యక్షుడు విఘ్నేష్‌బాబు మాట్లాడుతూ.. క్వారీల్లో వడ్డెరలకు 15 శాతం రిజర్వేషన్ కల్పించాలని, ప్రమాదవశాత్తు గాయపడిన వృత్తిదారులను ఆదుకోవాలని కోరారు. క్షౌరవృత్తిదారుల సంఘం అధ్యక్షుడు మల్లేష్ మాట్లాడుతూ.. కార్పొరేట్ కంపెనీలు వచ్చి వృత్తిదారుల జీవనోపాధిని దెబ్బతీశాయని, రాజకీయాల్లోనైనా రిజర్వేషన్లు వర్తింపజేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. విశ్వబ్రాహ్మణ సంఘం నాయకుడు ఎ.వెంకటాచారి మాట్లాడుతూ.. కట్టెకోత మిషన్లకు 5హెచ్‌పీ వరకే ఉచిత కరెంట్ ఇస్తున్నారని, దీన్ని 10 హెచ్‌పీ వరకు పెంచాలన్నారు. 50 ఏళ్లు నిండిన వృత్తిదారులందరికీ పెన్షన్ మంజూరు చేయాలన్నారు. ఆరెకటిక సంఘం అధ్యక్షురాలు సునీత మాట్లాడుతూ.. మాంసం విక్రయాలపై ఆధారపడిన తమ వృత్తిదారులకు రాజకీయంగా అవకాశం కల్పించాలని కోరారు. సగర సంఘం అధ్యక్షుడు సతీష్‌సాగర్ మాట్లాడుతూ.. చిన్నచిన్న సివిల్ కాంట్రాక్ట్‌లు చేసుకుని జీవించే తమ వృత్తిదారులను బీసీ డి జాబితా నుంచి తొలగించి, బీసీ ఏ జాబితా లో చేర్చాలని విన్నవించారు. పూసలి సంఘం అధ్యక్షుడు సదానందం మాట్లాడుతూ.. తమకు కనీస గుర్తింపు లేకుండా పోయిందని, రాజకీయంగా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

బీసీ హక్కుల పరిరక్షణే ధ్యేయం

బీసీ హక్కుల పరిరక్షణ కోసం బీసీ కమిషన్ పని చేస్తుందని కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. సమాజంలో వెనుకబడిన, బలహీనవర్గాల ప్రజలు ఎంతమంది ఉన్నారో తెలిస్తే వారికి అవకాశాలు కల్పించేందుకు ఆస్కారం ఉందని అభిప్రాయపడ్డారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ హక్కుల విషయంలో కమిషన్ ముక్కు సూటిగా వ్యవహరిస్తుందని చెప్పారు. బీసీలపై దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. సమగ్రకుల సర్వే చారిత్రాత్మక నిర్ణయమని, జనాభాలో బీసీలు ఎంతమంది ఉన్నారో తెలుస్తుందన్నారు. బలహీన వర్గాల అభ్యున్నతి కోరుకునే ప్రతి ఒక్కరూ సర్వేకు సహకరించాలని సూచించారు. ఇప్పటి వరకు తెలంగాణ వ్యాప్తంగా 65 నుంచి 70 శాతం సర్వే పూర్తయిందని తెలిపారు. జిల్లాలో నిర్వహించిన బహిరంగ చర్చలో 72 పిటిషన్లు అందాయని వెల్లడించారు. జనాభా పరంగా రిజర్వేషన్లు కల్పించాలని, క్రిమిలేయర్ తొలగించాలని, ప్రమోషన్లలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని, కుమ్మరులకు చెరువు మట్టిని ఉచితంగా ఇవ్వాలని, ముదిరాజులు, కుమ్మరి, బట్రాజ్ తదితర కులాలను బీసీ డీ నుంచి ఏ జాబితాలోకి మార్చాలని, రజకులను ఎస్సీలుగా గుర్తించాలని, పిచ్చకుంట్లను పూర్తిగా ఆపేరుతో పిలవడం మానేసి వంశరాజ్‌గా మాత్రమే పిలవాలనే వినతులు అందినట్లు వివరించారు. సమావేశంలో బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి పాల్గొన్నారు.

బీసీలకు నిధులు కేటాయించండి



మాట్లాడుతున్న మానసపాటి ప్రదీప్‌కుమార్

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వం బీసీ జనాభాకు దామాషా ప్రకారం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని బీసీ మహాసభ రాష్ట ప్రధాన కార్యదర్శి మానపాటి ప్రదీప్‌కుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక, విద్యా, బీసీ స్థితిగతుల అధ్యయనంలో భాగంగా గురువారం కలెక్టరేట్‌లో బీసీ కమిషన్ బహిరంగ విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా బీసీల అభ్యున్నతికి చర్యలు తీసుకోవాలని మానపాటి ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బీసీల కుల గణన సర్వేతో బీసీ కులాల సామాజిక, ఆర్థిక స్థితిగతులను అంచనా వేసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. నాలుగు దశాబ్దాలుగా కార్పొరేట్ విధానం వ్యాపార రంగంలోని ప్రవేశించి గ్లోబలైజేషన్, ఇండస్ట్రియల్ పేరుతో కులవృత్తలను పూర్తిగా నాశనం చేసిందని అన్నారు. ప్లాస్టిక్ వచ్చిన తర్వాత మేదరి కులస్తులు, వడ్రంగి, కుమ్మరి కులవృత్తుల వారు తమ వృత్తులకు దూరం కావాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. స్వర్ణకారులు, మత్స్యకారులు, గీత కార్మికులు, నాయీ బ్రాహ్మణులు కులవృత్తులకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కులవృత్తులను పునరుద్ధరించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో కృష్ణాజీ, శ్రీధర్‌వర్మ, అశోక్, వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

చాలెంజింగ్ జాబ్ పోలీస్



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఐజీ

- రాజ్యాంగబద్ధంగా విధులు నిర్వర్తించాలి
- మల్టీజోన్- 2 ఐజీ సత్యనారాయణ
- 271 మంది ఏఆర్ ఎస్‌సీటీపీసీల అవుట్ పరేడ్



పరేడ్ నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుళ్లు

అనంతగిరి: పోలీస్ అంటే చాలెంజింగ్ జాబ్ అని మల్టీజోన్- 2 ఐజీ వి.సత్యనారాయణ అన్నారు. వికారాబాద్‌లోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో గురువారం 2024 బ్యాచ్‌కు చెందిన 271 మంది ఏఆర్ ఎస్‌సీటీపీసీల (స్టైపెండరీ కేడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుల్) దీక్షాంత్ (పాసింగ్ అవుట్) పరేడ్‌ను ఘనంగా నిర్వహించారు. వీరంతా తొమ్మిది నెలల పాటు ఇక్కడ శిక్షణ పొందారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐజీకి ఘన స్వాగతం పలికారు. రామగుండం నుంచి 119 మంది, సిద్దిపేట నుంచి 60, కొమురంభీం ఆసిఫాబాద్ నుంచి 58 మంది, మహబూబాబాద్ నుంచి 34 మంది పాసింగ్ ఔట్ పరేడ్‌లో పాల్గొన్నారు. డీటీసీ ప్రిన్సిప్ మురళీధర్ వీరితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఐజీ మాట్లాడుతూ.. తెలంగాణ ఊటీగా పేరు పొందిన వికారాబాద్‌లోని శిక్షణ కేంద్రంలో విజయవంతంగా ప్రాథమిక శిక్షణ ముగించుకున్న 271 మంది అభ్యర్థులలో అందరూ, అన్ని పరీక్షలో ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఇందుకు ఎంతో కష్టపడిన అధికారులు, సిబ్బంది ఇండోర్, ఔట్ డోర్ ఫ్యాకల్టీని అభినందించారు. విధుల్లో చేరిన ప్రతిఒక్కరూ రాజ్యాంగబద్ధంగా, క్రమశిక్షణతో ప్రజలకు సేవ చేయాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజా, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం ఏర్పాటైనదే పోలీసు వ్యవస్థ అని తెలిపారు. ప్రజల రక్షణ, వారి హక్కులు, ఆత్మగౌరవం మన బాధ్యత అని స్పష్టంచేశారు. పోలీసులకు ఫిట్‌నెస్ చాలా ముఖ్యమని తెలిపారు.

బహుమతుల ప్రదానం

అనంతరం బెస్ట్ ఇండోర్‌గా ఎస్.నాగేందర్, బెస్ట్ ఔట్ డోర్, బెల్ట్ ఆల్ రౌండర్‌గా ఎల్.సురేష్, బెస్ట్ ఫైరర్‌గా ఓ.వినోద్‌కుమార్‌కు బహుమతులు అందజేశారు. ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, డీఎస్పీలు విజయ్ కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, ఏఓ జ్యోతిర్మణి, ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఎంతో ప్రోత్సహించారు



నేను ఇంటర్ వరకు చదివా.. మొదటి ప్రయత్నంలోనే కానిస్టేబుల్ వచ్చింది. శిక్షణ కాలంలో కొత్తం కష్టం అనిపించినా.. శిక్షకులు, అధికారులు మమ్మల్ని ఎంతో ప్రోత్సహించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని అంశాల్లో ట్రైనింగ్ ఇచ్చారు.

– బి.నితిన్

ప్రశాంత వాతావరణం



మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే వికారాబాద్ వాతావరణం చాలా ప్రశాంతంగా ఉంటుంది. యూనిఫాంపై మక్కువతో పోలీసు శాఖలో చేరా. ట్రైనింగ్‌లో నేర్చుకున్న ప్రతీ అంశాన్ని విధుల్లో పాటిస్తా.

– జి.అజయ్‌కుమార్

క్లుప్తంగా

కనుల పండువగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన


ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యాలాల: మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయ ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ మహోత్సవం గురువారం కనుల పండువగా నిర్వహించారు. మధ్యాహ్నం మంత్రోచ్ఛరణల మధ్య ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. అదే సమయంలో గ్రామ నాభిశిల(బొడ్రాయి) ప్రతిష్ఠాపన సైతం చేశారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో అన్న సంతర్పణ నిర్వహించారు. మూడు రోజులుగా ప్రతిష్ఠాపన మహోత్సవాలను ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు విజయవంతంగా చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజరయ్యారు. గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సిద్రాల శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పేరి రాజేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ భక్తులు పాల్గొన్నారు.

పులుమద్దిలో టీజీఐఆర్డీ బృందం పర్యటన


గ్రామంలో క్రీడా ప్రాంగణం వద్ద టీజీఐఆర్డీ బృంద సభ్యులు

అనంతగిరి: వికారాబాద్ మండలంలోని పులుమద్ది గ్రామాన్ని గురువారం రాజేంద్రనగర్‌లోని తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్(టీజీఐఆర్డీ) బృందం సందర్శించింది. శిక్షణలో భాగంగా గ్రామంలో పర్యటించామని వారు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఎస్‌డబ్ల్యూఎం షెడ్, సీసీ రోడ్లు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు, నర్సరీ, పార్కు, క్రీడా ప్రాంగణం గ్రామ పరిసరాలు తదితర వాటిని పరిశీలించారు. స్థానిక అధికారులతో నిర్వహణ ఎలా చేస్తున్నారు. ఏ నిధులతో చేశారు తదితర వాటిపై ఆరా తీశారు. వీరివెంట ఎంపీడీఓ వినయ్‌కుమార్, ఎంపీఓ దయానంద్, ఏపీఓ శీను, ఈసీ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

మీర్‌పేట: కుమారుడి ఇంటికి వచ్చిన మహిళ అదృశ్యమైన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కర్నూల్ జిల్లా డోన్ మండలానికి చెందిన లక్ష్మీదేవి(50) ఈ నెల 16వ తేదీన మీర్‌పేట నందనవనంలో నివాసముండే కుమారుడి ఇంటికి వచ్చింది. 18వ తేదీన ఉదయం ఆమె ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం వెతికినా ప్రయోజనం లేకపోవడంతో కుటుంబ సభ్యులు గురువారం మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్సీ వాహనం ఢీకొని.. వ్యక్తికి తీవ్ర గాయాలు

షాద్‌నగర్‌రూరల్: మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి వాహనం ప్రమాదానికి గురైంది. గురువారం ఆయన షాద్‌నగర్ నుంచి పాతజాతీయ రహదారి మీదుగా హైదరాబాద్ వైపు వెళ్తున్నారు. మార్గమధ్యలో ఫరూఖ్‌నగర్‌కు చెందిన జంగయ్య హైదరాబాద్ రోడ్డులో స్కూటీపై వెళుతూ అకస్మాత్తుగా యూటర్న్ తీసుకున్నాడు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి కారు స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన జంగయ్యను చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కారులో ఉన్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి సురక్షితంగా ఉన్నారు.

దిగుబడి.. దిగులు


ఎన్కేపల్లిలో పత్తి పంట

- పత్తిలో తగ్గిన పంట ఉత్పత్తులు
- మద్దతు ధర ఆశాజనంగా ఉన్నా నష్టాలు
- మరోవైపు వేధిస్తున్న కూలీల కొరత
- పెట్టుబడులు సైతం రావట్లేదని రైతుల ఆందోళన

మోమిన్‌పేట: ప్రస్తుత ఖరీఫ్ పంటలపై రైతుల ఆశలు ఆవిరయ్యాయి. అధిక వర్షాలతో పంటల ఎదుగుదల లేకపోవడం.. వాటిపై ఆశిస్తున్న వైరస్‌లతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మండలంలో పత్తి సాగు గణనీయంగా పెరిగినా దిగుబడులు తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు రెండు, మూడు క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తే మహా గొప్పని ఆరుగాలం శ్రమించిన అన్నదాతలు వాపోతున్నాయి. పెట్టిన పెట్టుబడులు సైతం రావని తలలు పట్టుకుంటున్నారు. ప్రస్తుత సంవత్సరం కేంద్ర ప్రభుత్వం పత్తికి మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521లు ప్రకటించడం హర్షణీయమే అయినా, సరైన దిగుబడులు లేక కర్షకులు దిగాలు చెందుతున్నారు.

17 వేల ఎకరాల్లో సాగు

బహిరంగ మార్కెట్‌లో కూడా తెల్ల బంగారానికి మంచి రేటు పలుకుతుందని రైతులు ఆశించారు. మండలంలో 17వేల ఎకరాలలో పత్తిని సాగు చేశారు. ఖరీఫ్ మొదట్లో వర్షాలు సక్రమంగా కురిశాయి. కాయ, పిందె సమయంలో అధిక వర్షాలు పంటను పూర్తిగా దెబ్బతీశాయి. పెట్టుబడులు పెరగడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గతంలో ఎన్నడూ ఎదురు కాని పరిస్థితులు ప్రస్తుత ఖరీఫ్‌లో ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. ఖరీఫ్ పంటలు నాశనం కావడం.. వర్షాలు కురవడంతో రబీలో పంటలు పండే అవకాశం ఉన్నా కూలీల కొరత పట్టి పీడిస్తుందని మదనపడుతున్నారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి

కిలోకు రూ.15లు ఇచ్చినా కూలీలు దొరకడం గగనమైందని రైతులు వాపోతున్నారు. రోజుకు రూ.450లు ఇస్తే కూడా 10 నుంచి 12 కిలోలు పత్తి తీయడం లేదంటున్నారు. ఎటు చూసిన కూలీల కొరత కొట్టొచ్చినట్లు కన్పిస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియంత్రిత వ్యవసాయ విధానంతో ప్రతి కుటుంబం పత్తి పంటనే సాగు చేస్తున్నారు. ఖరీఫ్ రైతులను తీవ్ర అప్పుల ఊబిలోకి నెట్టి వేసిందని విచారం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఆశలతో ప్రారంభించిన ఖరీఫ్ నేడు నిరాశకు గురి చేసిందని వారు పేర్కొంటున్నారు. ప్రభుత్వం రైతు భరోసాను అందించి పత్తి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

ఈసారి ముంచింది



కౌలుకు తీసుకొన్న ఏడు ఎకరాల్లో పత్తి సాగు చేశా. విత్తనాలు విత్తుకొనే మొదలు ఇప్పటి వరకు రూ.రెండు లక్షలు పెట్టుబడి పెట్టా. అధిక వర్షంతో మొక్క మీటరు ఎత్తు కూడా పెరగలేదు. పది కాయలు మాత్రమే వచ్చాయి. అప్పుడే ఎండాకు తెగులు సోకి ఆకులు రాలిపోయాయి. కూలీలు దొరకక ఇబ్బందులు పడుతున్నాం. ఈసారి పత్తి పూర్తిగా ముంచింది.

– ఆనందం, కౌలు రైతు, ఎన్కేపల్లి


మూడు క్వింటాళ్లే



నాకున్న ఐదు ఎకరాలలో పత్తిని సాగు చేశా. మొక్కకు 10 కాయలు వచ్చాయి. అధిక వర్షాలు కురవడంతో ఎకరాకు మూడు క్వింటాళలే వచ్చింది. దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపింది. పెట్టిన పెట్టుబడులు రాని పరిస్థితి నెలకొంది. చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం రైతు భరోసా ఇచ్చి ఉంటే ఇబ్బంది వచ్చేది కాదు.

– నజీర్ అహ్మద్, రైతు, ఎన్కేపల్లి

మెనూ పాటించకపోతే చర్యలు


మంచి నీటి ట్యాంక్‌ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్


కేజీబీవీ స్టోర్ రూంలో సామగ్రిని తనిఖీ చేస్తున్న సబ్‌కలెక్టర్

- తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్
- కేజీబీవీలో ఆకస్మిక తనిఖీ

యాలాల: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టకపోతే కఠిన చర్యలు తప్పవని తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ హెచ్చరించారు. గురువారం సాయంత్రం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టోర్ రూంలో నిల్వ ఉంచిన కూరగాయలను పరిశీలించారు. అక్కడ కొన్ని కుళ్లిన స్థితికి చేరడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. వంటలకు వినియోగించే పదార్థాలను తనిఖీ చేశారు. కాగా కేజీబీవీలో తాగునీటి సమస్య ఏర్పడితే బోరు నీటినే తాగుతామని పలువురు విద్యార్థులు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. తాగునీటి విషయంలో కేజీబీవీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం కేజీబీవీపై అంతస్తులో ఏర్పాటు చేసిన ట్యాంకుల శుభ్రతను స్వయంగా పరిశీలించారు. సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ సమయంలో కేజీబీవీ ఎస్‌ఓ మంగమ్మ ఓడీపై వెళ్లడంతో రెండు రోజుల తరువాత కార్యాలయంలో కలవాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ అంజయ్య, ఎంఈఓ సుధాకర్‌రెడ్డి, ఆర్‌ఐ సాయిచరణ్ తదితరులు ఉన్నారు.

ప్రమాదంలో అనంతగిరి

- ఆలయ భూములు అన్యాక్రాంతమయ్యే పరిస్థితి
- హిందూ జనశక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు లలిత్‌కుమార్


అనంతగిరిలో మాట్లాడుతున్న హిందూ జనశక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు లలిత్‌కుమార్

వికారాబాద్ అర్బన్: కార్తీక పురాణంలో పేర్కొన్న అనంతగిరులకు అన్యమత ప్రమాదం పొంచి ఉందని, అతి త్వరలోనే ఈ ప్రాంతాన్ని వక్ఫ్ బోర్డు ఆక్రమించే దుస్థితి దాపురించిందని హిందూ జనశక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు లలిత్‌కుమార్ అన్నారు. గురువారం వికారాబాద్ జిల్లా అనంతగిరికి వచ్చిన ఆయన కార్తీక మాస ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వక్ఫ్ బోర్డుకు ఇప్పటికే దేశవ్యాప్తంగా 9 లక్షల ఎకరాల భూమి ఉందన్నారు. దురాశతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను వక్ఫ్ బోర్డు పేరిట కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. పవిత్రమైన అనంతగిరి క్షేత్రంలో అనుమతి లేకుండా ఓ మతానికి చెందిన స్కూల్‌ను నడుపుతుంటే అధికారులు, పాలకులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తమిళనాడు, తిరుభద్దూర్, శబరిమలై, ముంబై సిద్ధివినాయక టెంపుల్ మాదిరిగానే అనంతగిరి పద్మనాభస్వామి ఆలయానికి సైతం వక్ఫ్ బోర్డు ప్రమాదం పొంచి ఉందన్నారు. మూసీ ప్రక్షాళనను హైదరాబాద్ నుంచి కాకుండా.. అనంతగిరి నుంచి చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వికారాబాద్‌లోని పద్మనాభస్వామి ఆలయ పుష్కరిణి చుట్టూ ఉన్న పాలగుండం, నెయ్యిగుండం, తేనెగుండం, కాశీనుంచి ఉద్భవించిన గంగాజలంతో కలియుగ తీర్థంగా ఉన్న మూసీ అనంతగిరి నుంచి హైదరాబాద్ మీదుగా నల్లగొండ జిల్లాలో సంపూర్ణంగా పారుతూ వాడపల్లి వద్ద కృష్ణానదిలో కలుస్తోందని తెలిపారు. ఇంత పవిత్రమైన జలాల కోనేరులకు తాళం వేసి, మురుగు నీటిగా మార్చిన ఘనత ఆలయ నిర్వాహకులదేనని ఆరోపించారు. కొండల్లో వెలిసిన అనంతపద్మనాభ స్వామి ఆలయానికి ఒక్క గుంట భూమి కూడా లేదని, ఆలయ ఈఓ, ప్రధాన అర్చకుడు, అటవీ, ఎండోమెంట్ అధికారులు తెలపడం బాధాకరమైన విషయమన్నారు. భక్తులు, దాతలు సమర్పించిన కానుకలను ఇతర ఖర్చులకు ఉపయోగిస్తూ ఆలయానికి వచ్చే భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో నిర్వాహకులు విఫలమయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర హిందూ జనశక్తి అధ్యక్షుడు శ్రీనివాస్, ధార్మిక మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని గ్యారంటీలు అమలు చేస్తాం

- శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- ధారూరులో రైస్‌మిల్లు ప్రారంభం


రైస్‌మిల్లును ప్రారంభిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

ధారూరు: ప్రజాపాలనలో మిగిలిన అన్ని గ్యారంటీలను వచ్చే సంవత్సరం సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తారని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ధారూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో రూ.2.01 కోట్లతో నిర్మించిన రైస్‌మిల్లు, గోదాంలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మిగిల్చిన అప్పుల కారణంగా మహిళలకు నెలకు రూ.2,500, రైతుబంధు, రుణమాఫీలో జాప్యం జరుగుందని ఆరోపించారు. ఇతర సంక్షేమ పథకాల అమలు చేయడానికి కొంత సమయం పడుతుందన్నారు. వచ్చే సంవత్సరం అన్ని సంక్షేమ పథకాలు అమలు అవుతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సీఎం వచ్చే నెలలోపు అన్ని రకాల పాత బకాయిలను చెల్లిస్తారన్నారు. ప్రస్తుతం ఉన్న నిరుద్యోగులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాలను సృష్టించాలన్నారు. ఇందుకు పరిశ్రమల ఏర్పాటు, టూరిజం అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులతో పాటు తులం బంగారం ఇచ్చే కార్యక్రమం వచ్చే ఏడాదిలో అమలు చేస్తామని అన్నారు. జిల్లాలోని ప్రాజెక్టుల వద్ద టూరిజాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. అనంతగిరి కొండల్ని రూ.300 కోట్లతో సుందరీకరణ చేయిస్తామన్నారు. అంతకు ముందు రైస్‌మిల్లు ప్రారంభోత్సవానికి స్పీకర్‌ను ఎడ్ల బండిపై ఊరేగింపుగా తీసుకువచ్చారు.

కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మండి..

ధాన్యం పండించిన రైతులకు తగిన మద్దతు వచ్చేలా ప్రభుత్వం కృషి చేస్తుందని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ధారూరు, నాగసమందర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ధాన్యంలో మట్టి, చెత్త లేకుండా చేసి, ఆరబెట్టి కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లాలని రైతులకు సూచించారు. సన్న రకం ధాన్యం విక్రయిస్తే రూ.500 బోనస్ ఇస్తున్నామని, కొంతమంది అనవసరంగా ఈ విషయంలో రాద్ధాంతం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాన్‌సింగ్, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లు విజయభాస్కర్‌రెడ్డి, ఎల్.అశోక్ ముదిరాజ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాజునాయక్, వాలీబాల్ అసోషియేషన్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, హరిదాస్‌పల్లి సొసైటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాములు, డీసీసీబీ డైరెక్టర్ కిషన్‌నాయక్, నాయకులు రాంచంద్రారెడ్డి, నందు, బాబాఖాన్, అవినాశ్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

జేఎల్‌లో సత్తాచాటిన ‘మ్యాథ్స్ ఎడ్యుకేషనల్’

11 మందికి ఉద్యోగాలు

అనంతగిరి: వికారాబాద్‌లోని మ్యాథ్స్ ఎడ్యుకేషనల్ అకాడమీలో శిక్షణ పొందిన 11మంది అభ్యర్థులు ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ (మ్యాథ్స్) ఉద్యోగాలకు ఎంపికయ్యారని ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ రత్నాకర్ తెలిపారు. మొత్తం 32 మంది ట్రైనింగ్ తీసుకోగా గురువారం విడుదలైన ఫలితాల్లో 11 మంది ఉద్యోగాలు సాధించడం ఆనందంగా ఉందన్నారు. ఎంపికైన వారిలో వికారాబాద్ జిల్లా నుంచి సాయికుమార్(26), శ్రీనివాస్(37), శ్రావణ్‌కుమార్(117), వరలక్ష్మి(238), రంగారెడ్డి జిల్లాకు చెందిన రాణి(29), మనీష(39) ఉన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపర్చాలి

జిల్లా విద్యాధికారి రేణుకాదేవి


మాట్లాడుతున్న రేణుకాదేవి

తాండూరు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగు పర్చాలని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి పేర్కొన్నారు. గురువారం తాండూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణ కార్యక్రమాన్ని విద్యాధికారి రేణుకాదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు గుణాత్మక విద్య అందించినప్పుడే ఉన్నత పాఠశాల స్థాయిలో మెరుగైన ఫలితాలు సాధిస్తారన్నారు. ఉపాధ్యాయుల బోధన విద్యార్థులకు సులభతరంగా అర్థమయ్యే విధంగా బోధన చేయాలన్నారు. ఈ విద్యా సంవత్సరంలో పదిలో మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటాం


సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

ఎమ్మెల్యే కాలె యాదయ్య

- చేవెళ్లలో పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

చేవెళ్ల: రైతులు పండించిన పత్తిని మొత్తం సీసీఐ కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య హామీ ఇచ్చారు. మండల కేంద్రంలోని దామరగిద్ద సమీపంలో ఉన్న శ్రీనివాస కాటన్ మిల్లు వద్ద గురువారం సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని చెప్పారు. రైతులు పండించిన ధాన్యం, పత్తిని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని సూచించారు. చేవెళ్లలో పత్తి కొనుగోలు కేంద్రం, శంకర్‌పల్లి, షాబాద్‌లలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎలాంటి కొర్రీలు పెట్టకుండా మద్దతు ధరలు అందించాలని ఆదేశించారు. పత్తి మద్దతు ధర రూ.7,200ల నుంచి 7,400 వరకు ఉంటుందన్నారు. రైతులు దళారులకు కాకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోనే అమ్ముకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసుదన్‌రెడ్డి, చేవెళ్ల ఏఎంసీ చైర్మన్ పెంటయ్యగౌడ్, పీఏసీఎస్ చైర్మన్లు డి.వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ రాములు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, సీసీఐ ప్రతినిధి రాజీవ్, పత్తి మిల్లు యజమాని రమేశ్‌కుమార్, మార్కెట్ కార్యదర్శి మహేందర్, వ్యవసాయ అధికారి శంకర్‌లాల్, డైరెక్టర్లు మల్లేశ్, నరేందర్, జనార్దన్, నాయకులు రాములు, శ్రీనివాస్‌గౌడ్, మధుసుదన్‌రెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు దశరథ్


కొండాయపల్లిలో పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న దశరథ్

దోమ: ప్రభుత్వం దివ్యాంగుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు దశరథ్ డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని కొండాయపల్లి గ్రామంలో రెండో రోజు దివ్యాంగులతో కలిసి తమ సమస్యలను పరిష్కరించేలా చూడాలని పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులను విస్మరిస్తోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నేటికీ అమలు చేయడంలో విఫలం అవుతుందని మండిపడ్డారు. తాము అధికారంలోకి వస్తే రూ.6 వేల పెన్షన్‌ను ఇస్తామని, నేటికీ ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెన్షన్ పెంపు కోసం 44 లక్షల మంది లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉన్న దివ్యాంగుల సమస్యలను పరిష్కరించే వరకు తాము గ్రామ గ్రామాన తిరుగుతూ పోరాటం చేస్తామన్నారు. డిసెంబర్ 9వ తేదీ వరకు పంచాయతీ కార్యదర్శులకు వినతిపత్రం ఇస్తూనే ఉంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు బీజేపీ సిద్ధం


మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి

కేశంపేట: బీజేపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం బీజేపీ సభ్యత్వ నమోదు అభియాన్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకుడు అందె బాబయ్యతో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలను గెలుపొందాలంటే గ్రామీణ స్థాయిలో పార్టీని ఇంటింటికి తీసుకెళ్లాలన్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటి నుంచి బీజేపీ సభ్యత్వం పొందే విధంగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలన్నారు. కార్యకర్తలు అత్యధిక సభ్యత్వాలను చేయడంతో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపు సులువవుతుందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీలను బీజేపీ అభ్యర్థులే గెలిచే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రఘురాంగౌడ్, నాయకులు శ్రీనివాస్, నరేందర్‌రెడ్డి, మహేశ్, ఐలయ్య, శ్రీనివాస్, విఠల్‌గౌడ్, నర్సింహ, తిరుపతి, కుమార్‌గుప్తా, గోపాల్‌రెడ్డి, మల్లేశ్, నర్సింగ్, అశోక్‌రెడ్డి, వెంకటేశ్వర్‌జీ పాల్గొన్నారు.

వేగంగా వెళ్తున్న కార్లు ఢీ

యాచారం: హైదరాబాద్– నాగార్జునసాగర్ రహదారిపై చౌదర్‌పల్లి గేట్ వద్ద వేగంగా వెళ్తున్న మూడుకార్లు గురువారం రాత్రి ఒకదాని వెనుక మరొకటి ఢీకొన్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న వేగ నియంత్రణ(స్పీడ్‌బ్రేకర్లు)లను అంచనా వేయకపోవడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు భావించారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కార్లు ఢీకొనడంతో కొద్దిసేపు సాగర్ రహదారిపై ఇరువైపులా పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి.

లింకు రోడ్డు.. ఏళ్లుగా పాట్లు

ఎన్కెపల్లిలో అవస్థలు పడుతున్న వాహనదారులు


కంకర తేలిన ఎన్కెపల్లి లింకు రోడ్డు

బంట్వారం: కంకర తేలిన ఎన్కెపల్లి లింకు రోడ్డుపై ద్విచక్ర వాహనదారులు, పాదచారులు నిత్యం తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. కోట్‌పల్లి మండల పరిధిలోని ఎన్కెపల్లి లింకు రోడ్డు అధ్వానంగా తయారైంది. జిన్నారం గేటు నుంచి ఎన్కెపల్లి మీదుగా బంట్వారం, తొర్మామిడి, కర్ణాటకలోని కుంచారం వెళ్లే వారికి చాలా సులువుగా ఉంటుంది. ప్రస్తుతం రోడ్డు బాగో లేకపోవడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లే వారు దూర ప్రాంతం నుంచి చుట్టూ తిరిగి తమ గమ్య స్థానాలకు చేరుకుంటున్నారు. ఎన్కెపల్లి లింకు రోడ్డుకు మరమ్మతులు చేస్తే వాహనదారులకు సౌకర్యంగా ఉంటుంది. ఏళ్ల తరబడి సమస్య అలాగే ఉండడంతో ద్విచక్ర వాహనదారులు తరచూ అదుపు తప్పి ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. కంకర తేలిన రోడ్డుపై రాత్రివేళ అటుగా వెళ్లాలంటేనే జంకుతున్నారు. ఎవరైనా ఆదమరిచి అటుగా వెళితే బొక్కబోర్లా పడాల్సిందే.

నిధులు మంజూరు చేయాలి



ఎన్కెపల్లి లింకు రోడ్డుకు సత్వరమే మరమ్మతులు చేపట్టాలి. ప్రభుత్వం ఇందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలి. సమస్యను ఏళ్ల తరబడి పరిష్కరించడం లేదు. కంకర తేలడంతో కాలినడకన కూడా వెళ్లలేకపోతున్నాం. బైకులపై వెళ్లే వారు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ లింకు రోడ్డును బాగు చేస్తే చాలా సౌకర్యంగా ఉంటుంది.

– లక్ష్మయ్య, ఎన్కెపల్లి

ప్రతిపాదనలు పంపిస్తాం

మెటిలింగ్‌తో పాటు బీటీ రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం. ఎన్కెపల్లి పంచాయతీ నుంచి తీర్మానం చేయాలి. త్వరలోనే రోడ్డును పరిశీలిస్తాం. రోడ్డు నిర్మాణానికి ఉన్నతాధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటాం.

– జితేందర్ దీక్ష, పీఆర్